11-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి మరియు పిల్లల యొక్క కర్మల మధ్యన వ్యత్యాసం ఏదైతే ఉందో దానిని గుర్తించండి, తండ్రి పిల్లలైన మీతో ఆడుకోగలరు కానీ తినలేరు"

ప్రశ్న:- సత్యమైన సాంగత్యము తీరానికి చేరుస్తుంది, కుసాంగత్యము ముంచేస్తుంది - దీని భావార్థము ఏమిటి?

జవాబు:- ఇప్పుడు మీరు సత్యమైన సాంగత్యమును చేస్తారు అనగా తండ్రితో బుద్ధియోగాన్ని జోడిస్తారు, కావున మీరు తీరానికి చేరుకుంటారు. మళ్ళీ నెమ్మది-నెమ్మదిగా చెడు సాంగత్యములోకి అనగా దేహ సాంగత్యములోకి రావడంతో దిగిపోతూ ఉంటారు ఎందుకంటే సాంగత్యపు రంగు అంటుకుంటుంది, అందుకే - సత్యమైన సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది అని అంటారు. మీరు దేహసహితంగా దేహపు సర్వ సంబంధాలను మరచి తండ్రితో సాంగత్యమును చేయండి అనగా తండ్రిని స్మృతి చేయండి, తద్వారా తండ్రి సమానముగా పావనముగా అవుతారు.

ఓం శాంతి. ఇప్పుడు పిల్లలకు రెండు క్లాస్ లు ఉన్నాయి. ఇది బాగుంది, ఒకటేమో స్మృతి యాత్ర, దాని ద్వారా పాపాలు తొలగిపోతూ ఉంటాయి, ఆత్మ పవిత్రంగా అవుతూ ఉంటుంది మరియు రెండవ క్లాస్ జ్ఞానానికి సంబంధించినది. జ్ఞానం కూడా సహజమైనదే. ఇందులో ఏ కష్టమూ లేదు. మీ సెంటర్ కి మరియు ఇక్కడికీ తేడా ఉంటుంది. ఇక్కడైతే తండ్రి కూర్చొని ఉన్నారు మరియు పిల్లలూ ఉన్నారు. ఇది తండ్రి మరియు పిల్లల మేళా. మరియు మీ సెంటర్లలో పిల్లల మధ్యన పరస్పరంలో మేళా జరుగుతుంది, అందుకే పిల్లలు సమ్ముఖముగా వస్తారు. స్మృతి చేసినా కానీ మీరు ఇక్కడ సమ్ముఖముగా చూస్తారు. మీతోనే కూర్చుంటాము, మీతోనే మాట్లాడుతాము... అని అంటారు. తండ్రి మరియు పిల్లల యొక్క కర్మల మధ్యన వ్యత్యాసం ఉంది అని తండ్రి అర్థం చేయించారు. ఆలోచించండి, ఇందులో తండ్రి పాత్ర ఏమిటి మరియు రథము పాత్ర ఏమిటి? తండ్రి రథము ద్వారా ఆడగలరా? అవును ఆడగలరు. మీతోనే కూర్చుంటాము, మీతోనే తింటాము... అని అంటారు, కానీ వారు స్వయమైతే తినరు. పిల్లలతో కలిసి ఆడడము అంటే ఇరువురూ ఆడతారు అని తండ్రి స్వయంగా అర్థం చేసుకుంటారు. వారు అన్నీ ఇక్కడే మీతో కలిసి చేస్తారు ఎందుకంటే వారు సుప్రీమ్ టీచర్ కూడా. పిల్లలను ఆహ్లాదపరచడం టీచర్ యొక్క పని. ఇండోర్ గేమ్స్ ఉంటాయి కదా. ఈరోజుల్లో ఆటలు కూడా రకరకాలవి వెలువడ్డాయి. అన్నింటికన్నా ప్రసిద్ధమైనది పాచికల ఆట, దీని గురించి మహాభారతములో వర్ణన ఉంది. కానీ అది జూదము రూపములో ఉంది. జూదము ఆడేవారిని పట్టుకుంటారు. ఈ విషయాలన్నీ భక్తి మార్గపు పుస్తకాల నుండి వెలికి తీయడం జరిగింది.

ఈ వ్రతాలు, నోములు మొదలైనవన్నీ భక్తి మార్గపు విషయాలని మీకు తెలుసు. నిర్జలముగా ఉంటారు, ఆహారం కూడా తినరు అలాగే నీరు కూడా తాగరు. ఒకవేళ భక్తి మార్గంలో ప్రాప్తి కలిగినా కానీ అది అల్పకాలికమైనదే. ఇక్కడ పిల్లలైన మీకు అంతా అర్థం చేయించడం జరుగుతుంది. భక్తి మార్గంలో ఎన్నో ఎదురుదెబ్బలు తింటారు. జ్ఞాన మార్గము సుఖపు మార్గము. మనం సుఖ వారసత్వాన్ని తండ్రి నుండి తీసుకుంటున్నామని మీరు తెలుసుకున్నారు. భక్తి మార్గంలో కూడా ఒక్కరినే స్మృతి చేయవలసి ఉంటుంది. ఒక్కరి పూజ కూడా అవ్యభిచారి పూజయే, అది కూడా మంచిదే. భక్తి కూడా సతో-రజో-తమోగా ఉంటుంది. అన్నింటికన్నా ఉన్నతోన్నతమైన సతోగుణీ భక్తి శివబాబా యొక్క భక్తి. శివబాబాయే వచ్చి పిల్లలందరినీ సుఖధామములోకి తీసుకువెళ్తారు. ఎవరైతే అందరికన్నా ఎక్కువగా పిల్లల సేవను చేస్తారో, పావనముగా తయారుచేస్తారో వారినే పిలుస్తారు కూడా. మళ్ళీ ఇంకొకవైపు రాయి-రప్పల్లో ఉన్నారు అని అంటారు, ఇది నిందించినట్లు కదా. పిల్లలైన మీకు అనంతమైన తండ్రి ద్వారా రాజ్యభాగ్యము లభించింది, అది మళ్ళీ తప్పకుండా లభించనున్నది. జ్ఞానము వేరు, భక్తి వేరు అని మీరు భావిస్తారు. రామరాజ్యం మరియు రావణరాజ్యం ఎలా నడుస్తుంది - ఇది కూడా మీరు నంబరువారుగా, పురుషార్థం అనుసారముగా తెలుసుకున్నారు, అందుకే కరపత్రాలు మొదలైనవి కూడా ముద్రిస్తూ ఉంటారు ఎందుకంటే మనుష్యులకు యథార్థమైన వివరణ కూడా కావాలి కదా. మీదంతా సత్యమే.

పిల్లలు సేవ చేయాలి. సేవ అయితే ఎంతో ఉంది. సేవ కొరకు ఈ బ్యాడ్జి కూడా ఎంత మంచిది. అన్నింటికన్నా పెద్ద శాస్త్రము ఈ బ్యాడ్జి. ఇప్పుడు ఇవి జ్ఞానము యొక్క విషయాలు, ఇందులో అర్థం చేయించవలసి ఉంటుంది, ఈ స్మృతి యాత్ర వేరు. దీనిని అజపాజపము అని అంటారు. జపించడానికి ఏమీ లేదు. లోలోపల కూడా శివ-శివ అని

అనకూడదు. కేవలం తండ్రిని స్మృతి చేయాలి. మీకు తెలుసు - శివబాబా తండ్రి, ఆత్మలమైన మనం వారి సంతానము. వారే సమ్ముఖంగా వచ్చి - నేను పతితపావనుడిని, పావనంగా తయారుచేయడానికి నేను కల్పకల్పమూ వస్తాను అని అంటారు. దేహసహితంగా దేహపు సర్వ సంబంధాలనూ వదిలి స్వయాన్ని ఆత్మగా భావించండి. మీ తండ్రినైన నన్ను స్మృతి చేయండి, తద్వారా మీరు పావనంగా అవుతారు. పతితులను పావనంగా తయారుచేయడమే నా పాత్ర. ఇది బుద్ధియోగము అనగా తండ్రితో సాంగత్యము. సాంగత్యము ద్వారా రంగు అంటుకుంటుంది. సత్సాంగత్యము తీరానికి చేరుస్తుంది, కుసాంగత్యము ముంచేస్తుంది అని అంటారు. తండ్రితో బుద్ధియోగాన్ని జోడించడం ద్వారా మీరు తీరానికి చేరుకుంటారు. మళ్ళీ దిగడం మొదలుపెడతారు. సత్సాంగత్యము తీరానికి చేరుస్తుంది... అని వారి గురించి ఈ విధంగా అంటూ ఉంటారు. దాని అర్థము కూడా భక్తి మార్గం వారికి తెలియదు. మన ఆత్మ పతితముగా ఉందని, పావనమైనవారితో బుద్ధియోగాన్ని జోడించడం ద్వారా పావనముగా అవుతుందని మీరు అర్థం చేసుకుంటారు. ఆత్మ, పరమాత్మ తండ్రిని స్మృతి చేయవలసి ఉంటుంది. ఎప్పుడైతే ఆత్మ పవిత్రముగా అవుతుందో, అప్పుడే శరీరము కూడా పవిత్రముగా అవుతుంది, సత్యమైన బంగారముగా అవుతుంది. ఇది స్మృతి యాత్ర. యోగాగ్ని ద్వారా వికర్మలు భస్మమవుతాయి, మాలిన్యం తొలగిపోతుంది. మీకు తెలుసు - సత్యయుగ కొత్త ప్రపంచములో మనం పవిత్రంగా, సంపూర్ణ నిర్వికారులుగా ఉండేవారము, 16 కళా సంపూర్ణులుగా కూడా ఉండేవారము. ఇప్పుడు ఏ కళలూ లేవు, దీనిని రాహు గ్రహణము అని అంటారు. మొత్తం ప్రపంచమంతటిపైనా, విశేషముగా భారత్ పై రాహు గ్రహణము పట్టి ఉంది. తనువు కూడా నల్లగా ఉంది, అలాగే ఈ కళ్ళతో ఏదైతే చూస్తారో, అంతా నల్లగానే ఉంది. యథా రాజా రాణి తథా ప్రజా. శ్యామసుందరుడు అంటే అర్థము కూడా ఎవ్వరికీ తెలియదు. మనుష్యులు ఎన్ని పేర్లను పెట్టారు. ఇప్పుడు తండ్రి వచ్చి దాని అర్థాన్ని వివరించారు. మీరే మొదట సుందరముగా, ఆ తర్వాత నల్లగా అవుతారు. జ్ఞానచితిపై కూర్చోవడం ద్వారా మీరు సుందరముగా అవుతారు, ఎంతైనా మళ్ళీ - శ్యామము నుండి సుందరముగా, సుందరము నుండి శ్యామముగా అవ్వాల్సిందే. దాని అర్థము తండ్రి ఆత్మలకు అర్థం చేయించారు. ఆత్మలమైన మనం ఒక్క తండ్రినే స్మృతి చేస్తాము. మనం ఒక బిందువు అని బుద్ధిలోకి వచ్చింది. దీనినే ఆత్మ యొక్క రియలైజేషన్ (స్వ పరిచయము) అని అంటారు. మళ్ళీ చూసేందుకు దివ్య దృష్టి లభిస్తుంది. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు. ఆత్మ గురించి అర్థం చేసుకోవాలి. నేను ఆత్మను, ఇది నా శరీరము. మనం ఇక్కడికి శరీరములోకి వచ్చి పాత్రను అభినయిస్తాము. మొట్టమొదట డ్రామా ప్లాన్ అనుసారంగా మనము వస్తాము. అందరూ ఆత్మలే - కొందరిలో పాత్ర ఎంతగా ఉంటుంది, ఇంకొందరిలో కొంత ఉంటుంది. ఇది చాలా గొప్ప అనంతమైన నాటకము. ఇందులోకి నంబరువారుగా ఎలా వస్తారి, ఏ విధముగా పాత్రను అభినయిస్తారు అనేది మీకు తెలుసు. మొట్టమొదట దేవీ-దేవతా వంశము ఉంటుంది. ఈ జ్ఞానం కూడా మీకు ఇప్పుడు, ఈ పురుషోత్తమ సంగమయుగములో ఉంటుంది. మళ్ళీ తర్వాత ఇదేమీ గుర్తుండదు. తండ్రి స్వయంగా అంటారు - ఈ జ్ఞానం కనుమరుగైపోతుంది. దేవీ-దేవతా ధర్మ స్థాపన ఎలా జరిగిందో ఎవరికీ కూడా తెలియదు. చిత్రాలు అయితే ఉన్నాయి కానీ అది ఎలా స్థాపన అయ్యింది అన్నది ఎవరికీ తెలియదు. పిల్లలైన మీకు తెలుసు, మళ్ళీ మీరు ఇతరులను తమ సమానముగా తయారుచేస్తారు. ఎక్కువ మంది అయిపోతే తప్పకుండా మళ్ళీ లౌడ్ స్పీకర్ పెట్టాల్సి ఉంటుంది. ఏదో ఒక యుక్తి తప్పకుండా వెలువడుతుంది. చాలా పెద్ద హాల్ అవసరం పడుతుంది. కల్పపూర్వం ఏ కర్మలనైతే చేసారో, అవే మళ్ళీ జరుగుతాయి. ఇది అర్థమవుతుంది. పిల్లలు వృద్ధి చెందుతూ ఉంటారు. బాబా అర్థం చేయించారు - ఎవరైతే వివాహాల కొరకు హాళ్ళు మొదలైనవాటి తయారుచేయిస్తారో, వారికి కూడా అర్థం చేయించండి. ఇక్కడ కూడా వివాహాల కొరకు ధర్మశాలలు మొదలైనవి తయారుచేస్తున్నారు కదా. మన కులానికి చెందినవారు ఎవరైనా ఉంటే వారు వెంటనే అర్థం చేసుకుంటారు, ఎవరైతే ఈ కులానికి చెందినవారు కారో, వారు విఘ్నాలను కలిగిస్తారు. ఎవరైతే ఈ కులానికి చెందినవారై ఉంటారో - వారు వెంటనే నిజమే చెప్తున్నారు అని అంగీకరిస్తారు, ఎవరైతే ఈ ధర్మానికి చెందినవారు కారూ, వారు గొడవ పడతారు, ఇది ఆచారంగా కొనసాగుతూ వస్తుంది అని అంటారు. ఇప్పుడు ఇది అపవిత్ర ప్రవృత్తి మార్గము, పావనంగా తయారుచేయడానికి తండ్రి మళ్ళీ వచ్చారు. మీరు పవిత్రత విషయములో జోరు చూపిస్తారు, అందుకే ఎన్ని విఘ్నాలు కలుగుతాయి. ఆగాఖాన్ ఉన్నారు, వారికి ఎంత గౌరవముంది. పోప్ కు కూడా గౌరవము ఉంది. పోప్ వచ్చి ఏమి చేస్తారో మీకు తెలుసు. లక్షల-కోట్ల వివాహాలను చేయిస్తారు, ఎన్నో వివాహాలు జరుగుతాయి. పోప్ వచ్చి కంకణం కట్టిస్తారు, దానిని వారు ఒక గౌరవంగా భావిస్తారు. మహాత్ములను కూడా వివాహాలకు ఆహ్వానిస్తారు. ఈరోజుల్లో నిశ్చితార్థాలు కూడా చేయిస్తూ ఉంటారు. కామం మహాశత్రువు అని తండ్రి అంటారు. ఈ ఆజ్ఞను జారీ చేయడం అంత సులువైన విషయమేమీ కాదు, ఇది అర్థం చేయించేందుకు ఎంతో యుక్తి కావాలి. ముమ్ముందు నెమ్మది-నెమ్మదిగా అర్థం చేసుకుంటూ ఉంటారు. ఆది సనాతన హిందూ ధర్మం వారు ఎవరైతే ఉన్నారో, వారికి అర్థం చేయించండి. తప్పకుండా ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము ఉండేది, హిందూ ధర్మం కాదు అని వారు వెంటనే అర్థం చేసుకోగలరు. ఏ విధంగా మీరు తండ్రి ద్వారా తెలుసుకున్నారో,

అలాగే ఇతరులు కూడా అర్థం చేసుకుని వృద్ధి చెందుతూ ఉంటారు. ఈ పక్కా నిశ్చయం కూడా ఉంది, ఈ అంటు కట్టబడుతూ ఉంటుంది. మీరు తండ్రి శ్రీమతముపై ఈ విధంగా దేవతలుగా అవుతారు. వీరు కొత్త ప్రపంచములో ఉండేవారు. మొదట మీకు - తండ్రి సంగమయుగములో వచ్చి మనల్ని ట్రాన్స్ఫర్ చేస్తారు అన్నది ఏమైనా తెలుసా. ఏ మాత్రమూ తెలియదు. ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు - సత్యాతి-సత్యమైన పురుషోత్తమ సంగమయుగము అని దీనినే అంటారు. మనం పురుషోత్తములుగా తయారవుతున్నాము. ఇప్పుడు ఎంత పురుషార్థము చేస్తే అంతగా దాని అనుసారంగా తయారవుతాము.

ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని ప్రశ్నించుకోవాలి. స్కూల్లో ఏ సబ్జెక్టులోనైనా కచ్చాగా ఉంటే, తాము ఫెయిల్ అవుతారని భావిస్తారు. ఇది కూడా పాఠశాల, స్కూలు. గీత పాఠశాలలు ప్రసిద్ధమైనవి. మళ్ళీ వాటి పేర్లను కొద్దికొద్దిగా మార్చేసారు. మీరు 'సత్యమైన గీత, అసత్యమైన గీత' అని రాసినప్పుడు, వారు డిస్టర్బ్ అవుతరు. తప్పకుండా గొడవలు జరుగుతాయి, ఇందులో భయపడవలసిన విషయము లేదు. ఈరోజుల్లో ఇదొక ఫ్యాషన్ అయిపోయింది, బస్సులు మొదలైనవాటిని కాలుస్తారు, నిప్పు అంటిస్తూ ఉంటారు. ఎవరు ఏది నేర్పిస్తే అది నేర్చుకుంటారు. ఇంతకుముందుకన్నా ఎక్కువగా అందరూ నేర్చుకున్నారు. అందరూ ధర్నాలు మొదలైనవి చేస్తూ ఉంటారు. గవర్నమెంట్కు కూడా ప్రతి సంవత్సరమూ నష్టము కలుగుతుంది, దాని వలన మళ్ళీ ట్యాక్స్ పెంచడం జరుగుతుంది. ఒకానొకరోజు బ్యాంకులు మొదలైనవన్నీ తమ ఖజానాలను తెరిచేస్తాయి. ధాన్యము మొదలైనవాటిని కూడా పరిశీలిస్తూ ఉంటారు - ఎక్కడా ఎక్కువగా అయితే పెట్టలేదు కదా అని. ఈ విషయాలన్నింటి నుండి మీరు విముక్తులైపోయారు. మీ కొరకు ముఖ్యమైనది స్మృతి యాత్ర. తండ్రి అంటారు - నాకు ఈ విషయాలతో ఏ సంబంధమూ లేదు. నా పని కేవలం దారిని చూపించడము మాత్రమే. తద్వారా మీ దుఃఖాలన్నీ దూరమైపోతాయి. ఈ సమయంలో మీ కర్మల లెక్కాచారము సమాప్తమవుతుంది. మిగిలి ఉన్న వ్యాధులు మొదలైనవన్నీ బయటకు వస్తాయి. చివరిలో మిగిలి ఉన్న కర్మల లెక్కాచారాలు సమాప్తమవ్వాలి, దీనికి భయపడకూడదు. అనారోగ్య సమయంలో కూడా మనుష్యులకు భగవంతుని స్మృతిని కలిగించడం జరుగుతుంది కదా. మీరు హాస్పిటళ్ళకు కూడా వెళ్ళి - తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి అని వారికి జ్ఞానాన్ని ఇవ్వండి. ఇది కేవలం ఈ జన్మకు సంబంధించిన విషయం కాదు, భవిష్య 21 జన్మల కొరకు నేను గ్యారంటీ ఇస్తాను - ఎప్పుడూ అనారోగ్యంపాలు అవ్వరు. ఒక్క తండ్రిని స్మృతి చేయడం ద్వారా మీ ఆయుష్షు కూడా పెరుగుతుంది. భారతవాసుల ఆయుష్షు ఎక్కువగా ఉండేది, నిరోగులుగా ఉండేవారు. ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు, శ్రేష్ఠముగా అయ్యేందుకు శ్రీమతాన్ని ఇస్తారు. పురుషోత్తములు అన్న పదమును ఎప్పుడూ మర్చిపోకండి. కల్పకల్పమూ మీరే అలా అవుతారు. ఈ విధంగా ఇంకెవరూ చెప్పలేరు. కావున ఇటువంటి సేవను ఎంతగానో చేయవచ్చు. డాక్టర్ల నుండి ఎప్పుడైనా సమయం తీసుకోవచ్చు. ఉద్యోగము చేసేవారు కూడా ఎంతో సేవ చేయవచ్చు. రోగగ్రస్థులకు చెప్పండి - మాకు కూడా పెద్ద డాక్టర్ ఉన్నారు, వారు అవినాశీ అనంతమైన సర్జన్. మేము వారికి చెందినవారిగా అయ్యాము, వారు మమ్మల్ని 21 జన్మల నిరోగులుగా చేస్తారు. ఆరోగ్యం కోసం అంతగా ఎందుకు కష్టపడుతున్నారు అని హెల్త్ మినిస్టర్ కు అర్థం చేయించండి. సత్యయుగములో మనుష్యులు చాలా కొద్దిమందే ఉండేవారు. శాంతి, సుఖము, పవిత్రత అన్నీ ఉండేవి.

మొత్తం ప్రపంచమంతటిలోనూ మీరే అందరి కళ్యాణాన్ని చేస్తారు. మీరు మార్గదర్శకులు కదా. మీరు పాండవ సాంప్రదాయానికి చెందినవారు. ఇది ఎవరి బుద్ధిలోనూ ఉండదు. ఫుడ్ మినిస్టర్ (ఆహార శాఖ మంత్రి) కి అర్థం చేయించండి - మొట్టమొదట అందరికన్నా పెద్ద ఫుడ్ మినిస్టర్ శివబాబా. వారు ఎంతటి ధాన్యమును ఇస్తారంటే దాని ద్వారా స్వర్గములో ఎప్పుడూ లోటు అనేది ఉండదు. ఇప్పుడు మీరు సంగమయుగములో ఉన్నారు. మొత్తం చక్రమంతా మీ బుద్ధిలో ఉంది అందుకే మిమ్మల్ని స్వదర్శన చక్రధారులు అని అంటారు. భారత్ దివాలాకోరుగా అయిపోయింది. తెలివైనవారు వచ్చి తమ తెలివిని నేర్పిస్తూ ఉంటారు, ఇది కూడా పిల్లలైన మీకు తెలుసు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఒక్క తండ్రిని సహచరునిగా చేసుకుని, మీతోనే కూర్చుంటాము, మీ నుండే వింటాము, మీతోనే తింటాము... అన్నది

అనుభవం చేయాలి. చెడు సాంగత్యమును వదిలి సత్యమైన సాంగత్యములో ఉండాలి.

2. కర్మల లెక్కాచారాన్ని స్మృతి యాత్ర మరియు కర్మభోగము ద్వారా సమాప్తం చేసి, సంపూర్ణ పావనులుగా అవ్వాలి. సంగమయుగములో స్వయాన్ని పూర్తిగా ట్రాన్స్ఫర్ చేయాలి.

వరదానము:- హృదయముతో 'నా బాబా' అని అంటూ సత్యమైన వ్యాపారము చేసే సరెండర్ మరియు మరజీవా భవ

బ్రహ్మాకుమారులుగా-కుమారీలుగా అవ్వటము అనగా సరెండర్ అవ్వటము. ఎప్పుడైతే హృదయముతో 'నా బాబా' అని అంటారో, అప్పుడు బాబా కూడా - పిల్లలూ, అంతా మీదే అని అంటారు. ప్రవృత్తిలో ఉన్నా, సెంటరులో ఉన్నా కానీ ఎవరైతే హృదయముతో నా బాబా అని అన్నారో, వారిని తండ్రి తమవారిగా చేసుకున్నారు, ఇది హృదయము యొక్క వ్యాపారము, నోటితో చేసే స్థూలమైన వ్యాపారము కాదు. సరెండర్ అనగా శ్రీమతము లోపల ఉండేవారు. ఈ విధంగా సరెండర్ అయ్యేవారే మరజీవా బ్రాహ్మణులు.

స్లోగన్:- ఒకవేళ 'నాది' అన్న పదము పట్ల ప్రేమ ఉన్నట్లయితే అనేక 'నా' అన్నవాటిని ఒక్క 'నా బాబా' లో ఇముడ్చి వేయండి.

ఈరోజు మనందరి అతి స్నేహీ, బాప్ దాదా యొక్క కనుపాప, తమ హృదయంలో హృదయాభిరాముడిని నిలుపుకున్న, బాప్ దాదా యొక్క రథము, (చిన్న నంది) గుల్జార్ దాదీ గారు 11 మార్చి 2021 నాడు అవ్యక్త వతనవాసిగా అయ్యారు. ఈరోజు వారి పుణ్య స్మృతి దివసం నాడు మనమందరమూ వారి అమూల్యమైన వచనాలను మన జీవితంలో ధారణ చేసుకుని, వారి స్నేహానికి మరియు బాప్ దాదాల పాలనకు రిటర్న్ ఇద్దాము, ఇదే వారికి మనం అర్పించే సత్యమైన శ్రద్ధాంజలి.

గుల్జార్ దాదీగారి ద్వారా ఉచ్చరించబడిన కొన్ని అమూల్యమైన వచనాలు

1. మీ బాధ్యతలన్నింటినీ బాబాకు ఇచ్చి డబల్ లైట్ గా ఉన్నట్లయితే సంతోషంతో నాట్యం చేస్తూ ఉంటారు.

2. మనసు-బుద్ధిని ఒక్క తండ్రిపై నిలపడము, ఏకాగ్రం చేయడమే సత్యమైన సాధన.

3. పరమాత్మ ప్రేమయే నిస్వార్థమైన ప్రేమ, ఇందుకు రిటర్న్ గా కేవలం సమానంగా అవ్వండి.

4. తండ్రి తోడును అనుభవం చేయడానికి మనసు-బుద్ధిని శుభ్రంగా మరియు స్పష్టంగా (క్లీన్ మరియు క్లియర్ గా) పెట్టుకోండి.

5. సర్వశక్తివంతుడైన తండ్రి తోడు ఉన్నారు, కావున సదా ఆనందంలో ఉండండి, తికమకపడకండి, భయ పడకండి, నిరాశ పడకండి.

6. అంతఃవాహక శరీరం ద్వారా సేవ చేయడానికి డబల్ లైట్ గా అవ్వండి.

7. బాబాకు మీ మనసు యొక్క స్థితిగతులను వినిపించండి, నయనాలలో నిలుపుకోండి అప్పుడు ఎవ్వరి వైపుకు దృష్టి వెళ్ళదు.

8. అంతిమ సమయంలో మనసా సేవ చేయడానికి సర్వ శక్తుల స్టాక్ ను జమ చేసుకోండి.